క్లుప్తంగా

25 నుంచి అంబేడ్కర్ నాటక ప్రదర్శన

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని సంఘం శరణంగచ్ఛామి నాటకం ద్వారా జీవనశైలి లక్ష్యం గురించి నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 25న అందోల్‌లో, 26న నారాయణఖేడ్, 27న జహీరాబాద్‌లో, 28న సంగారెడ్డిలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు, సామాజిక సేవకులు, విద్యార్థి సంఘం నాయకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి జన్మదిన వేడుకలు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని సంగమేశ్వర మందిరంలో సుబ్రహ్మణ్యస్వామి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పూజారులు బీఎస్ శంకర్‌రావు, మోహన్‌రావు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంగమేశ్వర భజన భక్త బృందం అధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామి పల్లకీసేవ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు చింతా సాయినాథ్, కౌన్సిలర్ ఆకుల శివకుమార్ పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

సంగారెడ్డి టౌన్: తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదర్శనకు సంగారెడ్డి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం 6 గంటలకు సంగారెడ్డి నుంచి అరుణాచలం వయా హైదరాబాద్ నుంచి బస్సు అరుణాచలం బయలుదేరుతుందన్నారు. ఏపీలోని కాణిపాకం విఘ్నేశ్వర, వేలూరులోని మహాలక్ష్మి అమ్మవారి దర్శనం, అనంతరం 25న రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. తిరిగి 26న సాయంత్రం బయలుదేరి 27వ తేదీన జోగులాంబ శక్తిపీఠం దర్శనం చేసుకుని సాయంత్రం సంగారెడ్డి చేరుకుంటుందని తెలిపారు. ఒక్కొక్కరికి టూర్ ప్యాకేజీ రూ. 4,100 ఉంటుందని, సంస్థ అధికార వెబ్సైట్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని 9959226267, 7382831381, నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

మా భూములు ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న భూ నిర్వాసితులు

కంది(సంగారెడ్డి): బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో తీసుకున్న భూములను తిరిగి తమకే ఇవ్వాలని మండల పరిధిలోని ఇంద్రకరణ్ భూనిర్వాసితులు డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రకరణ్ గ్రామస్తులు మాట్లాడుతూ సర్వే నంబర్ 454లోని 180 ఎకరాల భూమిని బీసీలు, ఎస్సీలకు గతంలో అప్పటి రాష్ట్రప్రభుత్వం కేటాయించిందన్నారు.ఆభూములను సాగుచేసుకుంటున్నామని తెలిపారు. అయితే హెచ్ఎండీఏ వెంచర్ కోసమని గత ప్రభుత్వం బలవంతంగా తమ నుంచి భూములను తీసుకుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే మా భూములను మాకు తిరిగి ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు రాజేందర్‌రెడ్డి, గ్రామస్తులు యాదయ్య, వీరాస్వామి, సత్య నారాయణ, మదయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు



బోనాలతో మహిళలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని కాకిజన్‌వాడ, న్యాల్‌కల్‌లో మల్లన్న స్వామి జాతర వైభవంగా కొనసాగుతోంది. రెండో రోజు సోమవారం స్వామివారికి మహిళలు పెద్దఎత్తున బోనాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే మల్గి గ్రామంలో స్వామివారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆయా కార్యక్రమాల్లో హద్నూర్ ఎస్ఐ రామానాయుడు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రారంభ వ్యాపారానికి రుణం

సంగారెడ్డి టౌన్: పీఎంఈజీపీ స్కీమ్ ద్వారా వ్యాపారం ప్రారంభించే వారికి రూ.50లక్షల రుణం 35 శాతం సబ్సిడీతో అందించనున్నట్లు ఎంఎస్ఎంఈ డీఎఫ్ఓ హైదరాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ బిస్ట్ అన్నారు. సోమవారం చిన్న, మధ్యతర పరిశ్రమల వ్యాపారవేత్తలతో కలిసి సంగారెడ్డి పరిశ్రమల కేంద్రంలో ఒకరోజు ఎంట్రప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ నిర్వహించారు. ఇందులో వ్యాపారాన్ని ఎలా ఏర్పాటు చేయాలనే దాని గురించి చర్చించారు.

పీజీ కళాశాల ఎత్తివేతకు కుట్ర?

- విరమించుకోవాలని తీర్మానం
- సర్వసభ్య సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ జగనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మిర్జాపూర్(బి)లో కొనసాగుతున్న ఉస్మానియా పీజీ కళాశాలను ఎత్తి వేసేందుకు కుట్ర జరుగుతోందని, ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకునేవిధంగా చూడాలని హద్నూర్ పీఏసీఎస్ చైర్మన్ జగనాథ్‌రెడ్డి కోరారు. అందుకు సంబంధించి సభ ఏకగ్రీవ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని ఆయన కోరారు. ఎంపీపీ అంజమ్మ అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా కొనసాగుతున్న పీజీ కళాశాలను ఎత్తివేసేందుకు యునివర్సిటీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని, అట్టి ప్రయత్నాన్ని విరమించుకునేవిధగా సభ ఏకగ్రీవ తీర్మానం చేయాలని కోరగా అందుకు సభ్యులు, అధికారులు అంగీకరించారు. దీంతో స్పందించిన ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. మూడేళ్లుగా తమ ఇంటి ముందు అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగలు, స్తంభాలను సరిచేయాలని పలుమార్లు అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఎంపీపీ అంజమ్మ సూచించగా వాటిని వెంటనే బాగు చేస్తామని ఏఈ అర్జున్ తెలిపారు. మండలానికి 70 విద్యుత్ స్తంభాలు వచ్చాయని వాటిలో కొన్నింటిని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని, మిగతావి కూడా ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీఓ సురేష్ పని తీరు బాగాలేదని ఫలితంగా తాము ఇబ్బందులు గురవుతున్నామని పలువురు సభ్యులు ఆరోపించారు. ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి కలుగజేసుకొని సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినందునా గతంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు వస్తాయా? లేదా? అని పలువురు సభ్యులు ప్రశించగా బిల్లులు తప్పకుండా వస్తాయని, సభ్యులు ఆందోళన చెందవద్దని ఎంపీడీఓ తెలిపారు. సమావేశంలో ఏఓ లావణ్య ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సాబేర్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ రాజీరెడ్డి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



చిన్నారికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

సర్వమతాల సారం ఒక్కటే

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ఘనంగా క్రిస్మస్ వేడుకలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, ప్రతిఒక్కరూ తోటి వారి పట్ల ప్రేమ, ఆప్యాయతతో మెలగాలని, ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి సొసైటీ గ్రౌండ్స్‌లో భారతినగర్ డివిజన్ పాస్టర్స్, ఇవాంజెలిస్ట్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి శ్రద్ధలతో ఆనందోత్సాహాల మధ్య క్రిస్మస్ పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, నగేష్‌యాదవ్, బీఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షుడు పరమేష్ యాదవ్, పాస్టర్ ప్రశాంత్, ఆయా చర్చీల పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పనికి పంపించొద్దు

- చదువు మానేసిన వారిని పాఠశాలల్లో చేర్పిస్తాం
- మండల విద్యాధికారి అంజయ్య



విద్యార్థిని మౌనికను పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ అంజయ్య

సదాశివపేట(సంగారెడ్డి): బడీడు పిల్లలను పనికి పంపించొద్దని ఎంఈఓ దండు అంజయ్య అన్నారు. మండల పరిధిలోని బాబిల్‌గామ్ గ్రామానికి చెందిన బేగరి మౌనికను సోమవారం పట్టణ పరిధిలోని కేజీబీవీ పాఠశాలలో 6వ తరగతిలో ఎంఈఓ దండు అంజయ్య చేర్పించి పాఠ్యపుస్తకాలు నోటుపుస్తకాలు అందజేసి హస్టల్ వసతి కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మౌనిక తల్లిదండ్రులు అశోక్, నర్సమ్మ మౌనిక చిన్నప్పుడే చనిపోవడంతో మండల పరిధిలోని మెల్గిరిపేట గ్రామంలోని అమ్మమ్మ వద్ద ఉంటూ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి వరకు చదువుకొని జూన్ నుంచి పాఠశాలకు రాకుండా కూలిపనులకు వెళ్తుందన్నారు. దీంతో మౌనిక అమ్మమ్మకు చదువు విలువ గురించి అవగాహన కల్పించి కేజీబీవీ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. బడికి వేళ్లకుండా చదువుమానేసిన పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నామని ఎంఈఓ అంజయ్య వివరించారు. హెచ్ఎం సుధాకీర్తి, సీఆర్పీలు రాజేశ్వర్, మల్లేశం పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి, సంక్షేమం

- సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి
- గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలి: ఎంపీపీ దేవదాసు



మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాసు

ఝరాసంగం(జహీరాబాద్): సమష్టి కృషితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఎంపీపీ దేవదాసు అన్నారు. మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ దేవదాసు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆదేవిధంగా పలు శాఖల అధికారుల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. గ్రామాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సమావేశంలో ప్రస్తావించిన సమస్యలు

- ఉపాధిహామీ పనుల బిల్లులు రావటంలేదని, ఇష్టానుసారంగా బిల్లులు అందిస్తున్నారని ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. పెండింగ్ ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.
- గ్రామాల్లో నూతన రేషన్‌కార్డులు ఎప్పుడు అందిస్తారని ఎంపీటీసీ శంకర్‌పాటిల్ సభ దృష్టికి తీసుకువచ్చారు.
- మండల పరిధిలోని బిడెకన్నె గ్రామ శివారులో ఉన్న అటవీ భూములను సర్వే చేయించాలన్నారు. హద్దులు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని ఎంపీపీ దేవదాసు అధికారులకు ఆదేశించారు.
- గ్రామాల శివారులోని పంటపొలాల్లో విద్యుత్తు స్తంభాలు ఒంగిపోయాయని, విద్యుత్తు తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని, సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎంపీటీసీ రాజు కోరారు.
- అడవిపందుల బెడద నుంచి పంటలను రక్షించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు.
- మండల విద్యాధికారి సమావేశానికి ఎందుకు హాజరు కావటంలేదని, సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని పలువురు సభ్యులు ప్రశ్నించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య వెంటనే పరిష్కరించాలన్నారు.
- మండంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయని, రోడ్డు పనులు ఎందుకు ప్రారంభించటంలేదని ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు.

సమావేశంలో వైస్‌ఎంపీపీ మల్లన్న పాటిల్, ప్రజాప్రతినిధులు శంకర్‌పాటిల్, రజనిప్రియ సంతోష్ కుమార్ పాటిల్, ఉమావతిమారుతీరావు పాటిల్, శకుంతల, సంగీత, రాజు, సంగయ్య, ఇక్బాల్ జానీ, అధికారులు సంజీవ్‌రావు, రమ్య, సునీల్‌దత్త్, రాజ్‌కుమార్, కృష్ణ, వెంకటేశ్వర్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పథకంతో ఉపాధి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప



మాట్లాడుతున్న జన్‌వాడే సంగప్ప

నారాయణఖేడ్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం పేద యువకుకు స్వయం ఉపాధిని కల్పిస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌లు తెలిపారు. నారాయణఖేడ్‌లో సోమవారం విశ్వకర్మ యోజన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వకర్మ యోజనతో కులవృత్తులపై గౌరవం పెరుగుతుందన్నారు. పథకాన్ని ఉత్సాహ వంతులైన యువతీ, యువకులు వినియోగించుకోవాలని సూచించారు. 18రకాల చేతివృత్తులకు విశ్వకర్మ యోజన రుణం అందుతుందని తెలిపారు. సదస్సులో ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, సంజయ్, శ్రీనివాస్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అయ్యప్పస్వాములు



ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న గురుస్వాములు

సదాశివపేట(సంగారెడ్డి): ఈ నెల 20వ తేదీన అయ్యప్ప మందిరంలో ఏర్పాటు చేసిన పడిపూజకు హాజరుకావాలని కోరుతూ సోమవారం అయ్యప్ప స్వాములు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మహాపడిపూజకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, గురుస్వాములు కృష్ణమనాయుడు, సుధాకర్‌గౌడ్, కృష్ణగౌడ్, శంకర్, సున్నం నరేష్, రాము, నల్ల వెంకటేశం గౌడ్, సుదర్శన్‌రెడ్డి, శంబుయాదవ్, పవన్‌యాదవ్, శివమణిగౌడ్, సత్యంగౌడ్, అనిల్ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల భత్యం చెల్లించండి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న అంగన్‌వాడీలు

జహీరాబాద్: ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా విధుల్లో పాల్గొన్న భత్యం చెల్లించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు తహశీల్దార్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు ముగిసి పక్షం రోజులు అయినా తమకు రావాల్సిన భత్యం అందలేదన్నారు. తామంతా బీఎల్‌ఓలుగా విధులను నిర్వహించినట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి తమకు రావాల్సిన భత్యం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎంను కలిసిన సభ్యులు



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీపీసీసీ సభ్యులు

నారాయణఖేడ్: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డిని సోమవారం నారాయణఖేడ్‌కు చెందిన టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో ఎంపీటీసీ చేరిక

నారాయణఖేడ్: మండల పరిధిలోని అనంతసాగర్‌కు చెందిన ఎంపీటీసీ బేగరి రాజు సోమవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రెండు రోజుల క్రితం ఇద్దరు ఎంపీటీసీలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరగా తాజాగా ఎంపీటీసీ రాజు కాంగ్రెస్‌లో చేరడంతో కాంగ్రెస్ ఎంపీటీసీల సంఖ్య 9కి చేరుకుంది. ప్రస్తుతం మండలంలో 18 మంది ఎంపీటీసీలకు గాను కాంగ్రెస్‌కు 9మంది, బీఆర్ఎస్‌కు 9మంది సభ్యులు అయ్యారు. కాంగ్రెస్ నాయకులు రమేష్‌చౌహాన్ పాల్గొన్నారు.

బకాయిలు లేకుంటేనే 'గృహజ్యోతి'

- సర్వసభ్య సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎంపీపీ బాలయ్య

జోగిపేట(అందోల్): విద్యుత్ బకాయిలు లేకుండా ఉంటేనే ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద అందించే ఉచిత విద్యుత్‌కు అర్హులవుతారని జోగిపేట ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బాలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు చెందిన అధికారులు వారి వారి నివేదికలను సభ్యులకు చదివి వినిపించారు. బస్టాండ్‌లో సీసీ కెమోరాలతో పాటు పోలీస్ నిఘా పెంచాలని, నేరడిగుంట గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఎంపీపీ తెలిపారు. గృహజ్యోతి పథకానికి సంబంధించిన విధివిధానాలు పూర్తిస్థాయిలో ఇంకా రాలేదని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణానికి మహిళల నుంచి మంచి స్పందన వస్తుందని కంట్రోలర్ పక్రోద్దీ అన్నారు. రెండో విడతలో గొర్రెల పంపిణీ పథకాన్ని లబ్దిదారులకు అందించాలని సర్పంచులు కోరారు. అనంతరం ఆయా శాఖలకు సంబంధించిన నివేదికల అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్అండ్‌బీ ఏఈ మనోజ్, ఏఈవో శ్రీనివాస్ ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

నారాయణఖేడ్: అఖండ హరినామ సప్తహా ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్ పట్టణంలో సోమవారం వారీకార్ సంప్రదాయ భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. కల్పనా హనుమాన్ ఆలయం నుంచి ప్రత్యేక వాహనంపై కరణ్‌గజేంద్ర భారతి మహారాజ్ కూర్చోగా శోభయాత్రను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ బాధ్యులు గున్నాల నర్సింహులు, నర్సింహారెడ్డి, నారాయణ, బాలయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ మంత్రికి సన్మానం

మునిపల్లి(అందోల్): మంత్రి దామోదర రాజనర్సింహను మాజీ ఎంపీపీలు బుదేరా రాజేశ్వర్ రావు, తాటిపల్లి రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ అసత్ పటేల్ ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడు రసూల్‌పటేల్, మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి, పెద్ద గోపులారం ఎంపీటీసీ పాండు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఆస్పత్రి సభ్యులు

సంగారెడ్డి: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్ట్, అవుట్ సోసింగ్ యూనియన్ సభ్యులు సోమవారం కలిశారు. మంత్రిని కలిసిన వారిలో అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి రాము, సభ్యులు వినోద్,ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

సంగమేశ్వరస్వామి వార్షికోత్సవాలు ప్రారంభం

కోహీర్(జహీరాబాద్): కవేలి గుట్టపై వెలసిన మహాలింగ సంగమేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభమైయ్యాయి. మంగళవారం ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

గ్రాడ్యుయేట్ ఫోరం ఇన్‌చార్జీగా ఖలీల్

జహీరాబాద్ టౌన్: తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం నియోజక ఇన్‌చార్జీగా పట్టణానికి చెందిన ఖలీల్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు దొడ్ల వెంకట్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఖలీల్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ కార్యవర్గ సభ్యులు బస్వరాజ్, వీరేష్ పాటిల్, బ్రహ్మజీలకు కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

- రైతుబంధు డబ్బులు మంజూరు చేయాలి
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలను ఇబ్బందులకు గురిచేయొద్దు



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

మునిపల్లి(అందోల్): గ్రామాల అభివృద్ధికి చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. ఎంపీపీ శైలజ అధ్యక్షతన జెడ్పీటీసీ మీనాక్షి, వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పద్మదుర్గయ్య అధ్వర్యంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ రైతుబంధు డబ్బులను ప్రభుత్వం బ్యాంకుల్లో జమ చేసిందని ప్రచారం జరగుతుండటంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కంకోల్ సర్పంచ్ విశ్వనాథం, మునిపల్లి సర్పంచ్ రమేశ్ మండల వ్యవసాయాధికారి శివకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, లక్షలు ఖర్చు చేసి పనులు చేపట్టినా ఇప్పటివరకూ బిల్లులు రాకపోవడంతో వాటికి వడ్డీలు చెల్లించలేకపోతున్నామని తాటిపల్లి సర్పంచ్ అంజిరెడ్డి, బుదేరా సర్పంచ్ మనోహర్‌యాదవ్ వాపోయారు. ఆధార్ కార్డు వర్జినల్ చూయిస్తేనే బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారని, వర్జినల్ ఆధార్‌కార్డు పోతే మహిళలు ఇబ్బందులకు గురవుతారన్నారు. దీంతో ఆధార్‌కార్డు జీరాక్స్ కాపీలు చూయిస్తే సరిపోతుందని ఎంపీపీ శైలజ, జెడ్పీటీసీ మీనాక్షి ఆర్టీసీ అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ పగిలిన పైపులకు మరమ్మతు చేయాలని ప్రజాప్రతినిధులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి అంగద్‌ను కోరారు. వారంలో ఒక రోజు ఎంపీడీఓ కార్యాలయంలో అయాశాఖల అధికారులు తప్పకుండా ఉండాలని, వారికి ఒక రూం ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ హరినందన్‌రావు తెలిపారు. అందుబాటులో లేని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



జిన్నారం: మండల పరిధిలోని కాజిపల్లి గ్రామంలో 181 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ జయప్రకాష్ నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.